సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం। 14। మే। 2023



47.395 టీఎంసీలు
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 47.395 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు) -	రూ.63,050
22 క్యారెట్లు ఆర్నమెంట్(గ్రా) -	రూ.5,662
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,832
నవర (8 గ్రా) -	రూ.46,656

గరిష్టం/కనిష్టం
37.6 /30.0

వాతావరణం
శనివారం గాలిలో తేమ 50 శాతం ఉంది. ఆదివారం వాతావరణంలో మార్పులు ఉండవచ్చు. ఎండ, ఉక్కపోత ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మున్సిపల్ పాఠశాలల బాధ్యత డీఈఓలకే..

గత నెల వరకు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మున్సిపల్ పాఠశాలల నిర్వాహణ, ఉపాధ్యాయుల పనితీరు పర్యవేక్షణ, వారి జీతాల చెల్లింపులు తదితర అన్ని వ్యవహారాలను కార్పొరేషన్ చూసుకునేది. ఇప్పుడా పరిస్థితి మారింది. కేవలం మున్సిపల్ పాఠశాలలకు చెందిన భవనాల మరమ్మతులను మాత్రమే కార్పొరేషన్ చూసుకోవాలి. మున్సిపల్ స్కూళ్లకు సంబంధించిన మిగిలిన అన్ని బాధ్యతలను జిల్లా విద్యాశాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ పరిణామం ఎంతో ఉపయోగకరమని పలువురు పేర్కొంటున్నారు.

- ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ బాధ్యత డీఈఓ, ఎంఈఓలకు..
- హెడ్‌మాస్టర్లకు డీడీఓ పవర్స్
- మున్సిపల్ స్కూల్స్ భవనాల మరమ్మతుల బాధ్యతే కార్పొరేషన్‌కు..
- నగరపాలక సంస్థకు తగ్గిన పనిభారం

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో..

మొత్తం మున్సిపల్ పాఠశాలలు - 68	ఉన్నత పాఠశాలలు 16
ప్రాథమికోన్నత పాఠశాలలు - 7	ప్రాథమిక పాఠశాలలు - 45



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ పాఠశాలల నిర్వాహణ, పర్యవేక్షణ, ఉపాధ్యాయుల జీతాలు, బదిలీలు, సెలవులు తదితర అంశాలన్నింటినీ 2009వ సంవత్సరానికి ముందు కార్పొరేషన్ అధికారులు చూసుకునేవారు. 2009 తర్వాత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మున్సిపల్ టీచర్లకు ఇచ్చే జీతాలు 010 అకౌంట్ ద్వారా 80 శాతం ప్రభుత్వం నుంచి, 20 శాతం ఆయా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల నుంచి అందేవి. అయితే ఈ ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ వరకు అమలులో ఉన్నది. ఏప్రిల్ నెల నుంచి మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన డీడీఓ(డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) అధికారాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. దీంతో మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఎంపీడీఓలు సంబంధిత జీతాల బిల్లులపై సంతకాలు పెట్టి ట్రెజరీకి పంపిన తర్వాత వారి బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమవుతాయి. అంతేకాకుండా మున్సిపల్ పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల బోధనపై జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షిస్తారు. దీంతో మున్సిపల్ పాఠశాలలపై కార్పొరేషన్‌కు గానీ మున్సిపాలిటీలకు గానీ ప్రధానమైన అంశాలపై ఎలాంటి బాధ్యత వహించే అవకాశం లేదు. కేవలం ఆయా పాఠశాలల భవనాల మరమ్మతుల పనులను మాత్రమే చూసుకోవాల్సి ఉంది. దీంతో కార్పొరేషన్, మున్సిపాలిటీలకు చాలావరకు బాధ్యత తగ్గినట్టైంది.

మున్సిపల్ టీచర్ల జీతాలు రూ.3,75,30,172

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 68 పాఠశాలలు ఉండగా ఇందులో 433 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికీ నెలకు రూ. 3,75,30,172 వేతనాల రూపంలో చెల్లిస్తున్నారు. వీరిలో ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 236 మంది ఉపాధ్యాయులు నెలకు రూ.2,29,31,562 జీతాలు పొందుతున్నారు. అలాగే ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వర్తించే 197 మంది ఉపాధ్యాయులకు నెలకు ప్రభుత్వం రూ. 1,45,98,610 వేతనాలుగా చెల్లిస్తోంది. ఇక నుంచి నేరుగా ఆయా పాఠశాలల నుంచే ట్రెజరీకి సదరు జీతాల బిల్లులు పెట్టుకోవడం, తద్వారా ఉపాధ్యాయుల ఖాతాల్లో వేతనాలు జమ చేయడం జరుగుతుంది. ఈ పరిణామం మంచిదేనని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

68 పాఠశాలలు.. 433 మంది ఉపాధ్యాయులు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 68 పాఠశాలల్లో మొత్తం 459 ఉపాధ్యాయుల పోస్టుల ఉన్నాయి. అయితే 16 ఉన్నత పాఠశాలల్లో 256 మంది ఉపాధ్యాయులకు గాను 236 మంది విధులు నిర్వర్తిస్తుండగా 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 52 ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 203 ఉపాధ్యాయులకు గాను 197 మంది విధులు నిర్వర్తిస్తుండగా 6 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి.

డీఈఓ పరిధిలోకి వెళ్లడం మంచిదే



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ పాఠశాలలన్నీ ఇటీవల వరకు కమిషనర్ కంట్రోల్‌లో ఉండేవి. ఏప్రిల్ నెల నుంచి జిల్లా విద్యాశాఖాధికారి ఆధీనంలోకి మార్చడం జరిగింది. దీని వల్ల మాకు కొంతవరకు మంచి జరిగినట్లైంది. ఇక నుంచి ఉపాధ్యాయుల బోధన, పాఠశాలల పనితీరుపై పర్యవేక్షించేది డీఈఓనే.
– శివరాంప్రసాద్, హెచ్‌ఎం, ఈఎస్‌ఆర్‌ఎం మున్సిపల్ హైస్కూల్, మూలాపేట

చాలా ఉపయోగకరం



కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ పాఠశాలల పనితీరుపై పర్యవేక్షణ, ఉపాధ్యాయుల సర్వీసు మేటర్లు తదితర విషయాలన్నీ ఇక నుంచి జిల్లా విద్యాశాఖాధికారి ఆధీనంలోనే జరగనున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి డీఈఓ కంట్రోల్‌కు బదిలీ చేయడం చాలా వరకు ఉపయోగకరమే.
– జి.రాజమనోహర్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

పనిభారం తగ్గినట్లైంది



నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పాఠశాలలకు సంబంధించిన అన్ని విషయాలను గతంలో కార్పొరేషన్ చూసుకుంటుండేది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ నుంచి ఆ పాఠశాలల పర్యవేక్షణ, బోధన, ఉపాధ్యాయుల బదిలీలు తదితర అంశాలన్నీ ఇకపై జిల్లా విద్యాశాఖ చూసుకోవాలి. దీంతో కార్పొరేషన్‌కు పనిభారం తగ్గినట్టైంది.
– చెన్నుడు, డిప్యూటీ కమిషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ

న్యూస్‌రీల్

3.5 కేజీల వెండి వస్తువుల బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక పెద్దూరులో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి ఓ దాత శనివారం 3.5 కేజీల వెండి వస్తువులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంచీపురానికి చెందిన టి.పద్మావతి స్వామివారికి ఈ వెండి వస్తువులను అందజేసినట్లు తెలిపారు.

తమిళ జాలర్లపై చర్యలు తీసుకోవాలి

- ఆఫ్కాఫ్ ఛైర్మన్ అనిల్‌బాబు

నెల్లూరు(సెంట్రల్): జిల్లా పరిధిలోని మత్స్య సంపదను అక్రమంగా తరలించుకుపోతున్న తమిళ జాలర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆఫ్కాఫ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు పేర్కొన్నారు. నెల్లూరులోని మత్స్యశాఖ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమిళ జాలర్ల ఆగడాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా విన్నవించామని, స్పందించిన ఆయన ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. త్వరలోనే తమిళనాడు అధికారులతో ఆంధ్రప్రదేశ్ అధికారులు మాట్లాడి జిల్లా మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా చేస్తారని తెలిపారు.

726 విద్యుత్ చౌర్యం కేసులు రాజీ

- రూ.9.15 లక్షల జరిమానా వసూలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలో విద్యుత్ చౌర్యానికి సంబంధించి 726 కేసులు రాజీ అయి జరిమానా కింద రూ.9.15 లక్షలు వసూలు చేసినట్లు జిల్లా విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. నగరంలోని జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఇందులో విద్యుత్ కేసులకు సంబంధించి రూ.9,14,500 వసూలు చేయడంలో కృషి చేసిన న్యాయమూర్తులు, విజిలెన్స్ అధికారులతోపాటు, జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ కె.వాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ భానురామన్, విద్యుత్ విజిలెన్స్ కానిస్టేబుల్ మధుసూదన్‌లను అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించను



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

దుత్తలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించనని విద్యాశాఖాధికారులపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండలంలోని దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా దుత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి విద్యాకానుక కిట్లలోని ప్రతి వస్తువును పరిశీలించారు. విద్యాశాఖ అధికారులపై పలు అంశాలకు సంబంధించి ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో డీఈఓ గంగాభవాని, ఎంఈఓ షావుద్దీన్ సరైన సమాధానం చెప్పకపోవడంతో వారిపై మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తేనే ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడవచ్చని తెలిపారు. ప్రతి కార్యక్రమంపై ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నా వాటిని సకాలంలో ఎందుకు పాటించడం లేదని అధికారులను నిలదీశారు. ఏఏ పాఠశాలలకు ఎన్ని పుస్తకాలు వస్తున్నాయి.. ఇంకా ఎన్ని రావాల్సి ఉందని అడిగిన ప్రశ్నలకు సంబంధిత మండల విద్యాశాఖాధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడంతో మండిపడ్డారు. అనంతరం నర్రవాడలోని ఓ విద్యార్థిని ఇంటికి వెళ్లి ఐరన్ మాత్రలు ఇస్తున్నారా.. లేదా.. అని ఆరా తీశారు. వేసవి సెలవుల్లో పునశ్చరణ తరగతులు ఎలా నిర్వహిస్తున్నారని అడగ్గా, తమ పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులు తీసుకున్నారని సమాధానం చెప్పడంతో.. సంబంధిత ప్రధానోపాధ్యాయుని పుస్తకాలు వెనక్కు తీసుకుంటే విద్యార్థులు పునశ్చరణ ఎలా చేస్తారని మండిపడ్డారు. రక్తహీనత గల పిల్లలకు 85 మాత్రలు ఇవ్వాల్సి ఉండగా 30 మాత్రమే ఎందుకిచ్చారని ప్రశ్నించారు. ప్రతి రోజూ 9 పాఠశాలలు తనిఖీ చేస్తే పూర్తి అవగాహన వస్తుందని, ఆ దిశగా ఆర్జేడీ, డీఈఓలు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం నందిపాడు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ప్రభుత్వం తరఫున సరఫరా చేసిన సామగ్రిని పరిశీలించి సామగ్రి నాణ్యతగా ఉన్నాయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లేకపోతే వెంటనే తనకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు దుత్తలూరులోని సీడ్స్ సంస్థలో పర్యటించి అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను తెలుసుకొని సంతృప్తిచెంది మొక్క నాటారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆర్‌జేడీ సుబ్బారావు, డీఈఓ గంగాభవాని, ఏపీసీ ఉషారాణి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పురుషామృగ వాహనంపై మల్లికార్జునుడు



పురుషామృగ వాహనంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దుష్టశక్తుల సంహారుడైన స్వామివారు పురుషామృగ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం యాగశాల వద్ద దీక్షాహోమం, దేవస్థాన ప్రాకార మండపం వద్ద బలిహరణ పూజ, స్వామి, అమ్మవార్లకు తిరుచా ఉత్సవం నిర్వహించారు. రాత్రి పురుషామృగ వాహనంపై మల్లికార్జునస్వామి కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక వాహనంపై అలంకరించి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు మల్లికార్జునస్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలకు వీవీ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, చిక్కుడు వెంకటకృష్ణానందప్రసాద్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, సుప్రజ, పద్మ, విజయమ్మ, విమల, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ట్రక్ ఆటో చోరీ కేసులో నిందితుడ్ని సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గుప్తా పార్కు సమీపంలోని శేషయ్య నాయుడి వీధిలో నివాసం ఉంటున్న పాపారావు తన ఆటోను ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి ఆటో అదృశ్యమవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ఆధారంగా మూలాపేటకు చెందిన నారాయణను నిందితుడిగా గుర్తించారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి ట్రక్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 13,058 కేసుల పరిష్కారం


కక్షిదారులకు చెక్కును అందజేస్తున్న జడ్జి కపర్ది

నెల్లూరు(లీగల్) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 13,058 కేసులు పరిష్కారం అయ్యాయి. లబ్ధిదారులకు రూ.7,43,35,103లు అందజేశారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కపర్ది జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించి, మాట్లాడారు. లోక్ అదాలత్‌లో ఒకసారి పరిష్కారమైన కేసుకు అప్పీల్ ఉండదని, అది శాశ్వత న్యాయ పరిష్కారం అవుతుందన్నారు. అనంతరం యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెక్కును న్యాయమూర్తి అందజేశారు. కాగా నెల్లూరు నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ బెంచ్‌ల ద్వారా 6,514 కేసులను పరిష్కరించారు. అలాగే వివిధ కోర్టులకు సంబంధించి గూడూరు - 1,211 కేసులు, కోవూరు - 1,107 కేసులు, కావలి - 201, వెంకటగిరి - 826, కోట - 732, నాయుడుపేట - 820, సూళ్లూరుపేట - 851, ఆత్మకూరు - 386, ఉదయగిరి - 410 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సత్యవాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణితో పాటు పలువురు న్యాయమూర్తులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు రూ.20 లక్షల విరాళం


చెక్కును అందజేస్తున్న దాత వేణుగోపాల్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో భారీ నంది విగ్రహ ఏర్పాటుకు నెల్లూరుకు చెందిన పారిశ్రామికవేత్త బండి వేణుగోపాల్‌రెడ్డి రూ.20 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.9.99 లక్షల నగదు చెక్కును ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడుకు శనివారం అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు నందకుమార్, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

సర్వేపల్లి కాలువలో వ్యక్తి మృతదేహం


మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : సర్వేపల్లి కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డు పూలే విగ్రహం సమీపంలో సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతుండటాన్ని శనివారం స్థానికులు గుర్తించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ కె.రాములునాయక్, ఎస్సై సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి జేబులో ఆధార్‌కార్డు లభించింది. దాని ఆధారంగా మృతుడు ప్రకాశం జిల్లా జరుగుమల్లికి చెందిన చినబాబు(44)గా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వార్డు రెవెన్యూ కార్యదర్శి సాయినవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి బాలిక అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యానికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఓపెన్ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్న మూడో కుమార్తె ఇంటి నుంచి శుక్రవారం అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు			
బ్రాయిలర్ (లైవ్)	: 142	బ్రాయిలర్ చికెన్	: 244
లేయర్ (లైవ్)	: 95	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
		లేయర్ చికెన్	: 162

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.18